క్లుప్తంగా

అధిక దిగుబడులు సాధించాలి



మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్త మల్లీశ్వరి

పుట్టపర్తి అర్బన్: మైక్రో వాటర్‌షెడ్ కింద ఎంపిక చేయబడిన గ్రామాల్లో సోమవారం నుంచి ఆరు రోజుల పాటు శిక్షణ తరగతులు ఉంటాయని కేవీకే శాస్త్రవేత్త మల్లీశ్వరి, వాటర్‌షెడ్ టెక్నికల్ ఆఫీసర్ భాస్కర్ తెలిపారు. ఆదివారం చెర్లోపల్లిలోని రైతు భరోసా కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పుట్టపర్తి మండలంలో మూడు మైక్రో వాటర్‌షెడ్‌ల పరిధిలో ఆరు గ్రామాలను అభివృద్ధి చేయడానికి వ్యవసాయ పరికరాలు, డ్రిప్ పైపులు, స్ప్రింక్లర్లు సబ్సిడీపై అందజేసినట్లు తెలిపారు. రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పెట్టుబడి తగ్గించుకుని నాణ్యమైన దిగుబడులు సాధించేలా రైతులకు మార్గదర్శనం చేయనున్నట్లు చెప్పారు. రైతులు ఈ శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ తరగతులకు అనంతపురం కృషి విజ్ఞాన కేంద్రం నుంచి ఇద్దరు సైంటిస్టులు హాజరవుతారన్నారు.

నేడు వాహనాల వేలం

అమడగూరు: ఓడీచెరువు మండలంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం ఉదయం 10 గంటలకు వాహనాల వేలం నిర్వహించనున్నట్లు ఎస్ఐ గోపి పేర్కొన్నారు. ఈనెల 15వ తేదీన నిర్వహించాల్సిన వేలంపాట కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందన్నారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ.2 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు.

గంగమ్మకు బోనాల ఊరేగింపు



అలంకరణలో గంగమ్మ దేవత

అమడగూరు: ఓడీచెరువు మండలంలోని రామిరెడ్డిపల్లిలో ఆదివారం గ్రామదేవత గంగమ్మకు దిష్టిబొట్టు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు అమ్మవారిని పట్టువస్త్రాలతో అలంకరించారు. బోనాలను సమర్పించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భజన కార్యక్రమాలు చేపట్టారు.

నేడు 'జగనన్న సురక్ష'

బత్తలపల్లి: మండలంలోని దంపెట్ల సచివాలయంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ యుగేశ్వరిదేవి, ఎంపీడీఓ సౌజన్యకుమారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గరిశలపల్లి, దంపెట్ల పంచాయతీలకు చెందిన ప్రజలు ఏమైనా సమస్యలు ఉంటే వినతిపత్రాలు అందజేయాలని సూచించారు. సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

క్రికెట్ టోర్నీ విజేత విషా టీం



క్రీడాకారులతో ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, విశాలా ఫెర్రర్

బత్తలపల్లి: ఎఫ్‌వీఎఫ్ (ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్) టీ20 కప్ 2023 క్రికెట్ టోర్నీ విజేతగా విషా టీం నిలిచింది. టోర్నమెంట్‌లో భాగంగా మూడు రోజులుగా విన్సెంట్ టీమ్, అన్నే టీమ్, మాంచో టీమ్, విషా జట్ల మధ్య పోటీలు నిర్వహించారు. ఆదివారం ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌లో విషా టీం, అన్నే టీంల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన విషా టీం 25 ఓవర్లలో 252 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన అన్నే టీం 232 పరుగులు మాత్రమే చేసింది. 20 పరుగుల తేడాతో విషా టీం ఘన విజయం సాధించింది. అనంతరం విజేత జట్టుకు ముఖ్య అతిథులుగా హాజరైన ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ డైరెక్టర్ విశాల ఫెర్రర్, హెడ్ కోచ్ యుగంధర్‌రెడ్డి బహుమతులు అందజేశారు.

కుటుంబ సభ్యుడిలా సేవలు



బడి బయట ఉన్న స్వాతిని పాఠశాలలో చేర్పిస్తున్న వలంటీర్ కాటమయ్య (ఫైల్)

ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు కాటమయ్య. బత్తలపల్లిలోని అంబేడ్కర్ కాలనీలో వలంటీర్‌గా పని చేస్తున్నారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నాడు. అంబేడ్కర్ కాలనీకి చెందిన శివప్రసాద్, నాగవేణి దంపతులకు స్వాతి, కవిత ఇద్దరు కుమార్తెలు. ప్రైవేట్ వాహనాలకు డ్రైవర్‌గా శివప్రసాద్, నాగవేణి హోటల్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరు కరోనాకు ముందు ఉపాధి నిమిత్తం బెంగళూరుకు వలస వెళ్లారు. మళ్లీ ఇంటికి వచ్చాక స్వాతిని బడిలో చేర్పించలేదు. వలంటీర్ కాటమయ్య.. ఈ విషయాన్ని వెంటనే సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ పవన్‌కుమార్ రెడ్డికి తీసుకెళ్లారు. అనంతరం బత్తలపల్లిలోని బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జయంతితో మాట్లాడారు. స్వాతికి ఆరో తరగతిలో అడ్మిషన్ ఇప్పించారు. బడి బయట ఉన్న విద్యార్థిని స్వాతిని బడిలో చేర్పించడంతో వలంటీర్ సేవలను స్థానికులు అభినందించారు. – బత్తలపల్లి:

వలంటీర్ సేవలు అభినందనీయం



మాకు చదువులు లేక కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. ఇప్పుడు నా భర్త కూడా నాకు సాయం చేయడం లేదు. బడిలో చేర్పించేందుకు కూతురుకు సర్టిఫికెట్లు లేకపోవడంతో ఇంటి పట్టునే ఉంటోంది. విషయం తెలుసుకున్న వలంటీరు కాటమయ్య దేవుడిలా వచ్చి మా కూతురిని 6వ తరగతిలో చేర్పించాడు. ఇప్పుడు నా కూతురు బడికి వెళ్తోంది. బాగా చదువుతోంది. మాకు చాలా సంతోషంగా ఉంది.

– నాగవేణి, అంబేడ్కర్ కాలనీ, బత్తలపల్లి

వలంటీర్లకు వందనం

కరోనా బాధితుడికి అండగా..



రామాపురంలో కరోనా బాధితుడికి మందులు ఇస్తున్న వలంటీర్ నాగార్జున (ఫైల్)

కరోనా మహమ్మారితో ప్రపంచం గజగజ వణుకుతున్న రోజులు అవి. కరోనా సోకిన వారు చాలామంది చనిపోతున్నారు. లాక్‌డౌన్ విధించడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చే పరిస్థితులు లేవు. ఒకరికి ఒకరు మాట్లాడుకునే సాహసం కూడా చేయడం లేదు. అలాంటి సమయంలో మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన వీ.రాజేంద్రకు కరోనా సోకడంతో 14 రోజులు క్వారంటైన్‌లో ఉన్నాడు. దీంతో రక్త సంబంధీకులు కూడా వారి కుటుంబాన్ని పలకరించలేదు. కనీసం తాగునీరు, కూరగాయలు కూడా లేక వారు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న వలంటీర్ నాగార్జున సేవలందించేందుకు ముందుకొచ్చాడు. వైద్య సిబ్బందితో కలసి ధైర్యంగా వీ.రాజేంద్ర వద్దకు వెళ్లాడు. మందులు, తాగునీరు, కూరగాయలు అందించి ఆదరించాడు. కరోనాతో బాధపడుతున్న చాలా కుటుంబాలకు బాసటగా నిలిచాడు. – తాడిమర్రి:

ఆపద్బాంధవుడు నాగార్జున..



కరోనా సోకిన రోగులకు వలంటీర్ నాగార్జున ఆపద్బాంధవుడిగా నిలిచాడు. నాకు కరోనా సోకడంతో ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి. రక్త సంబంధీకులు కూడా పట్టించుకోలేదు. ఆ సమయంలో చాలా ఇబ్బందులు పడ్డాను. మందులు లేక, తాగునీరు, ఆహారం దొరక్క ప్రాణాలు పోతాయని భయం వేసింది. ఇంతలో వలంటీర్ నాగార్జున ఎంతో ధైర్యం చేసి మా ఇంటికి వచ్చాడు. కరోనా నియంత్రణకు జాగ్రత్తలు వివరించి, ధైర్యం చెప్పాడు. మందులు, ఆహారం అందించి ఆదుకున్నాడు. వలంటీర్ సాయం మరువలేను.

– వీ.రాజేంద్ర, రామాపురం, తాడిమర్రి

వైభవంగా పోతలయ్య స్వామికి బోనాలు



ప్రత్యేక అలంకరణలో పూజలందుకున్న పోతలయ్య స్వామి



బోనాలు ఎత్తుకొని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

కనగానపల్లి: మండలంలోని వేపకుంటలో ఆదివారం పోతలయ్యస్వామికి బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని పోతలయ్యస్వామిని వెండి, బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలకంరించి భక్తులు పూజలు నిర్వహించారు. తర్వాతా గ్రామంలోని మహిళలు బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి స్వామిని దర్శించుకున్నారు. రైతులు, గొర్రెల కాపరులు జీవాలను పోతలయ్య స్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. వర్షాలు బాగా కురిసి, పంటలు బాగా పండాలని పోతలయ్యస్వామికి ఏటా బోనాల పండుగ చేస్తామని గ్రామస్తులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాలకు కమిటీల ఏర్పాటు



నక్కల చిన్నప్ప



మంజునాథరెడ్డి



గోపాల్‌రెడ్డి



రవీందర్ రెడ్డి



లక్ష్మీపతిరెడ్డి

పుట్టపర్తి: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి నియోకవర్గ వ్యాప్తంగా పార్టీ అనుబంధ సంఘాలకు కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా అమడగూరు మండలానికి సంబంధించి ఆదివారం పార్టీ కార్యాలయం కమిటీల జాబితాను విడుదల చేసింది. మండల గ్రీవెన్స్ సెల్ విభాగం అధ్యక్షుడిగా తనకంటివారిపల్లికి చెందిన నక్కల చిన్నప్ప, మండల ప్రచార కమిటీ విభాగం అధ్యక్షుడిగా సద్దపల్లికి చెందిన మంజునాథరెడ్డి, ట్రేడ్ యూనియన్ విభాగం మండల అధ్యక్షుడిగా గుండువారిపల్లికి చెందిన గోపాల్‌రెడ్డి, పంచాయతీ రాజ్ విభాగం మండల అధ్యక్షుడిగా యర్రగుండువారిపల్లికి చెందిన రవీందర్‌రెడ్డిని నియమించారు. అలాగే సేవాదళ్ విభాగం మండల అధ్యక్షుడిగా వెంకటనారాణపల్లికి చెందిన లక్ష్మీపతిరెడ్డిని నియమించారు. వీరితో పాటు ప్రతి కమిటీలోనూ ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు ఉంటారు. తమపై నమ్మకముంచి బాధ్యతలు అప్పగించినందుకు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి కమిటీల సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

వికసించిన బ్రహ్మకమలం



గాండ్లపెంట: మండల పరిధిలోని పోరెడ్డివారిపల్లి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ రోజారమణి ఇంటి పెరటిలో శనివారం రాత్రి బ్రహ్మకమలం వికసించింది. ఈ సందర్భంగా గ్రామస్తులు పుష్పానికి పూజలు చేశారు.

యల్లమ్మ దేవతకు పూజలు



పూజలందుకున్న యల్లమ్మ దేవత

తాడిమర్రి: కునుకుంట్ల గ్రామంలోని యల్లమ్మ దేవత ఆలయంలో గ్రామస్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు వెండి, బంగారు ఆభరణాలు తొడిగి, పూలమాలలతో అందంగా అలంకరించారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన మహిళలు అమ్మవారికి కొబ్బరి కాయలు సమర్పించారు. భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం ఆలయ పూజారి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

బళ్లారి దుర్గమ్మ ఆలయంలో పూజలు



అలంకరణలో బళ్లారి దుర్గమ్మ

బత్తలపల్లి: మండల కేంద్రంలో అనంతపురం రోడ్డులో ఉన్న బళ్లారి దుర్గమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ ఆభరణాలు, పూలతో అందంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆషాఢ మాసంలో చివరి రోజు కావడంతో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు. అనంతరం మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు.

శరవేగంగా తరగతి గదుల నిర్మాణం



బత్తలపల్లి: మండలంలోని సంజీవపురం గ్రామంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అదనపు తరగతి గదుల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. పాఠశాలలో విద్యార్థినుల సంఖ్య పెరగడంతో రూ.96 లక్షలతో 8 తరగతి గదులను నిర్మిస్తున్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ శ్రీనివాసులు, పాఠశాల ఎస్‌ఓ గుల్జార్ బేగం పనులను పర్యవేక్షిస్తున్నారు.

కూడళ్ల వద్ద హైమాస్ లైట్ల ఏర్పాటు



మామిళ్లపల్లి, ఎన్ఎస్ గేట్ సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన లైట్లు

కనగానపల్లి: జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రధాన జంక్షన్ల వద్ద పోలీసులు ఫ్లడ్ (హైమాస్) లైట్లు ఏర్పాటు చేయిస్తున్నారు. రాప్తాడు నియోజక వర్గ పరిధిలోని కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల పరిధిలోని మామిళ్లపల్లి, పెనుబోలు, ఎన్ఎస్ గేట్ వద్ద జంక్షన్లలో లైట్లు ఏర్పాటు చేసినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. వీటితో వాహన వేగాన్ని నియంత్రించేందుకు ప్రత్యేక సూచిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు.

నేడు స్పందన

బత్తలపల్లి/తాడిమర్రి: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్లు యుగేశ్వరి దేవి, నాగరాజు ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. గ్రామ సచివాలయాల్లో సచివాలయ ఉద్యోగులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. అదే విధంగా మండలస్థాయిలో జరిగే స్పందన కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు. ప్రజలు కూడా ఏవైనా సమస్యలుంటే వినతి పత్రాలను అందజేయవచ్చన్నారు. అర్జీదారులు తాము రాసుకున్న అర్జీకి ఆధార్‌కార్డు నకలు జతపరచాలన్నారు.

గౌనిపల్లిలో ఉచిత వైద్య శిబిరం

అమడగూరు: ఓడీచెరువు మండలంలోని గౌనిపల్లిలో ఆదివారం అనంతపురం సవేరా ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 200 మందికి చికిత్సలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

కదిరి టౌన్: పట్టణంలోని రాణిపేట స్కూల్‌లో చిన్న పిల్లల వైద్యుడు సీవీ మదన్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నంద్యాలకు చెందిన శాంతిరాం వైద్యశాల ఆధ్వర్యంలో 210 మందికి కంటి, గుండె పరీక్షలు చేశారు. లేజర్ శస్త్ర చికిత్సకు 60 మందిని, గుండెకు సంబంధించి చికిత్సకు ఇద్దరిని ఎంపిక చేశారు. అనంతరం వీరిని ఉచితంగా బస్సులో శాంతిరాం హాస్పటల్‌కు పంపించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి తాహేర్ వలి, ఏపీ ఎన్జీఓ సెక్రటరీ బాషా, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ పృథ్వీరాజ్ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చౌడేశ్వరి దేవి జయంత్యుత్సవం

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని వాల్మీకి పాఠశాల వద్ద ఉన్న చౌడేశ్వరి ఆలయంలో సోమవారం అమ్మవారి జయంత్యుత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

మున్సిపల్ మేస్త్రీ ఆత్మహత్యాయత్నం

కదిరి టౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ మేస్త్రీగా పని చేస్తున్న రఘునాథ్ రెడ్డి ఆదివారం పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మున్సిపల్ కార్యాలయంలో పని చేస్తున్న మున్సిపల్ వర్కర్ కళావతికి రఘునాథ్‌రెడ్డి కొంత డబ్బు ఇచ్చాడు. డబ్బు కావాలని కళావతిని అడిగినప్పుడల్లా కాలయాపన చేస్తోంది. ఈ విషయం రఘునాథరెడ్డి భార్యకు తెలియడంతో.. ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. భార్యను కాపురానికి పిలిచినా రాకపోవడంతో రఘునాథ్ రెడ్డి మనస్థాపానికి గురయ్యాడు. ఆదివారం ఇంటి సమీపంలో పురుగుల మందు సేవించాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడ్ని స్థానికులు వైద్య చికిత్స నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వైఎస్సార్‌టీఎఫ్ నూతన కార్యవర్గం ఎంపిక

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో వైఎస్సార్‌టీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడిగా హర్ష వర్దన్‌రెడ్డి, అధ్యక్షుడిగా శ్రీరాములు, ప్రధాన కార్యదర్శిగా కేశవరెడ్డి, కోశాధికారిగా నారాయణ రెడ్డి, జిల్లా కౌన్సిలర్లుగా భాస్కరరెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా జయచంద్ర, మురళీ, ప్రభాకర్, మహిళా సభ్యులుగా యశోదమ్మ, సువర్ణమ్మ, వెంకటలక్ష్మిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

జేసీబీ అపహరణపై కేసు నమోదు

పరిగి: మండలంలోని ఊటుకూరుకు చెందిన శివారెడ్డి అనే వ్యక్తికి చెందిన జేసీబీ వాహనం నాలుగు రోజుల క్రితం అపహరణకు గురైంది. అన్ని చోట్లా గాలించినా ఫలితం లేకపోవడంతో ఆదివారం వాహన యజమాని శివారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

రొళ్ల: మండల పరిధిలోని అగ్రహారంలో హేమరాజు అనే వ్యక్తి అనుమతి లేకుండా ట్రాక్టర్ ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తుండగా అదుపులోకి తీసుకుని ట్రాక్టర్‌ను సీజ్ చేశామని ఎస్ఐ వెంకటరమణ తెలిపారు. సీజ్ చేసిన ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

రొద్దం: మండల పరిధిలోని రాచూరు సమీపంలో ఆదివారం కర్ణాటక మద్యం తరలిస్తున్న న్యమదెల గ్రామానికి చెందిన మారుతిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు. 96 మద్యం పాకెట్లు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు.

కరుణించు.. వరుణదేవా



కుటాలపల్లిలో గంగమ్మకు బోనాలు తీసుకొస్తున్న మహిళలు



నల్లమాడ: గంగమ్మ ఆలయం ముందు భక్తుల సందడి

నల్లమాడ: వర్షాలు బాగా కురవాలంటూ కుటాలపల్లి గ్రామంలో ఆదివారం గ్రామస్తులు గంగమ్మ దేవతకు జ్యోతులు, బోనాలు సమర్పించారు. ఉదయం 11 గంటల సమయంలో గ్రామస్తులు తప్పెట్లతో సామూహికంగా బోనాలు ఊరేగించారు. ఈ సందర్భంగా గంగమ్మ దేవతను ప్రత్యేకంగా అలంకరించి బోనాలు సమర్పించారు. అనంతరం పొట్టేళ్లు, కోళ్లు బలి ఇచ్చి మొక్కలు తీర్చుకున్నారు. అలాగే మండలంలోని కొండ్రవారిపల్లి ఎస్సీ కాలనీలో వర్షాలు సకాలంలో కురవాలని కాలనీవాసులు మారెమ్మ, గంగమ్మకు దేవతలకు బోనాలు సమర్పించారు. పెద్ద సంఖ్యలో జంతువులను బలి ఇచ్చి, శాంతి పూజలు నిర్వహించారు. జ్యోతులు, బోనాల ఊరేగింపుతో ఆయా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

సల్లాపురమ్మకు బోనాల ఊరేగింపు

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని సైదాపురంలో వెలసిన సల్లాపురమ్మ దేవతకు ఆదివారం మహిళలు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అమ్మవారి ఆలయంలో పూజలు చేయించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బండారు శివమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు పరికి సాధిక్‌బాషా, మురళి, ఆంజనేయులు, జగన్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే హక్కుల సాధన



వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

పుట్టపర్తి టౌన్: వాల్మీకులు రాజకీయ పార్టీలకు అతీతంగా ఐక్యతతో హక్కుల సాధనకు కృషి చేయాలని రాష్ట్ర వాల్మీకి సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని శిల్పారామంలో ఆ సంఘం నాయకుడు కేశవ అధ్యక్షతన జిల్లా స్థాయి వాల్మీకి సంఘం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర సెక్రటరీ క్రాంతి నాయుడు, రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ జక్కల శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చాలా కాలం నుంచి వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అయితే రాజకీయ పార్టీలు వాల్మీకులను కేవలం ఓటు బ్యాంక్‌గా మాత్రమే చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరు ఏ పార్టీలో ఉన్న సంఘం నిర్ణయాలకు కట్టుబడి పని చేయాలన్నారు. జిల్లా యూత్ అధ్యక్షుడు బూదిలి కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, నాయకులు నల్ల బోతుల మల్లికార్జున, గంగాద్రి పాల్గొన్నారు.